ప్రజాశక్తి
గురువారం 15 డిసెంబర్ 2022
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ప్రభుత్వ స్థలంపై వైసిపి కన్ను

- జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న 4 ఎకరాలను పార్టీ కార్యాలయానికి కేటాయించే పనిలో రెవెన్యూ యంత్రాంగం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు
- క్రీడా మైదానం, కల్యాణ మండలం హామీని మంత్రి నిలబెట్టుకోవాలని డిమాండ్

వైసిపి నేతల కన్నుపడిన స్థలమిదే..

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్

అసలే అనకాపల్లి జిల్లా కేంద్రానికి దగ్గరిలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలం... రాష్ట్రంలోనే అభివృద్ధికి అద్దం లాంటి విశాఖకు కూతవేటు దూరం.. నాలుగెకరాల స్క్వేర్ బిట్టు.. చేతిలో అధికారం... ఇంకేముంది మాకెవ్వరు అడ్డు అన్నట్లు కోట్ల రూపాయలు విలువైన జాగాపై అధికార వైసిపి కన్ను వేసింది. వైసిపి జిల్లా కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని అధికారులపై ఒత్తిడి తేగా, అందుకు డూడూ బసవన్నలా రెవెన్యూ అధికారులు తలూపినట్లు తెలిసింది. అయితే ఈ స్థలాన్ని గ్రామ అవసరాల కోసం ఉంచుకోగా, దీనిని వైసిపి కార్యాలయానికి కేటాయిస్తున్నట్లు తెలుసుకున్న స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి జిల్లా, జివిఎంసి పరిధిలో ఉన్న రాజుపాలెం రెవెన్యూ, కొత్తూరు నరసింగరావుపేట సర్వే నెంబర్ 75/1, 75/3, 75/4లో నాలుగెకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ గ్రామం జివిఎంసిలో విలీనం కాక ముందు రాజుపాలెం పంచాయితీలో ఉండేది. అప్పట్లో చాలా మంది ఈ స్థలంలో పునాదులు వేసి ఇళ్ల నిర్మాణాలకు ప్రయత్నం చేశారు. అప్పటి పంచాయితీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ చొరవతో గ్రామస్తులనందరినీ ఒప్పించి అందులో ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగింపజేశారు. ఈ నాలుగెకరాల స్థలంలో గ్రామస్తులందరికీ ఉపయోగపడే కల్యాణ మండపం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యాయామ నడకదారి, గ్రంథాలయం, అప్పర్ ప్రైమరీ స్కూల్ వంటి నిర్మాణం కోసం ఉపయోగించాలని ఏకగ్రీవంగా తీర్మా నించారు. జివిఎంసిలో విలీనమైన తరువాత గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు

మిగతా 2లో..

మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రిమ షాహా

వైరస్ దాడులపై అప్రమత్తత అవసరం

- ఫోర్త్ వేవ్ కోవిడ్ వచ్చినా ఆందోళన చెందనక్కర్లేదు
- సమాజంలో సైన్స్ పాత్రపై చర్చ జరగాలి
- ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ అధ్యక్షులు ప్రొఫెసర్ చంద్రిమ షాహా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైరస్‌ల దాడుల పట్ల శాస్త్రవేత్తలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఇన్సా) అధ్యక్షురాలు, శాస్త్రవేత్త ప్రొఫెసర్ చంద్రిమ షాహా అన్నారు. సమాజంలో సైన్స్ పాత్రపై చర్చ జరగాల్సి ఉందని తెలిపారు. విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలోని వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ 88వ వార్షిక సాధారణ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె సదస్సును ప్రారంభించి మాట్లాడారు. వైరస్ దాడులపై దేశంలోని యువ, వృద్ధ శాస్త్రవేత్తల్లో సమిష్టి ఆలోచనాతత్వం, అప్రమత్తత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కిచెప్పారు. ప్రపంచంపై

మిగతా 2లో..

ఆకట్టుకున్న జగనన్న సాంస్కృతిక సంబరాలు

▶ వార్త మెయిన్‌లో..

దొడ్డిదారి బదిలీలపై యుటిఎఫ్ నిరసన

▶ వార్త మెయిన్‌లో..

దొంగతనాలు అరికట్టాలని వినతి

▶ వార్త 4లో..

అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చండి

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్‌కు సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల ఓటర్ల జాబితాలో అర్హులందరినీ ఓటర్లుగా చేర్చి ఒక పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్లనందరినీ అదే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా నూతన జాబితా ప్రకటించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కోరారు. బుధవారం ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో వందలాది మంది అర్హుల పేర్లులేవన్నారు. ప్రధానంగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకున్న అర్హుల పేర్లు జాబితాలో కనిపించలేదన్నారు. అందులో కొన్ని తహశీల్దారు కార్యాలయాల్లో ఈ దరఖాస్తులను కంప్యూటర్‌లో ఎక్కించడానికి సమయం చాలక పక్కన పెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, అర్హులందరినీ ఓటర్లుగా జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల ప్రకటించిన ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అనర్హుల పేర్లున్నట్లు ఇప్పటికే ఫిర్యాదు చేసిన విషయాన్ని కలెక్టర్‌కు గుర్తు చేశారు. దీనిపై అధికారులు, సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నట్లు పత్రికల్లో వార్తలు రావడం ముదావహమన్నారు. అర్హులు ఒక్కరు కూడా ఓటుకు దూరం కాకుండా, అనర్హులకు జాబితాలో చోటు లేకుండా చేయాలని మరోమారు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ మధ్య పోలింగ్ స్టేషన్లవారీ ఓటర్ల జాబితాను ప్రకటించగా ఇవి బిఎల్ఒలకు, ఓటర్లుకు తీవ్ర ఇబ్బందులకు గురిచేసేవిగా ఉన్నాయన్నారు. జివిఎంసి 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల్లోని ఓటర్లకు పిఎస్ నెంబరు 273 (58వ వార్డు), పిఎస్ నెంబరు 274 (40వ వార్డు), పిఎస్ నెంబరు 275 (61వ వార్డు) జివిఎంసి ప్రైమరీ పాఠశాలల్లో ఏర్పాటు చేశారన్నారు. ఈ మూడు పోలింగ్ స్టేషన్లలో ఏడు వార్డుల ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇది బిఎల్ఒల పనికి, ఓటర్లకు ఇబ్బంది అవుతోందని, ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదముందని అన్నారు. జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొందని చెప్పారు. ఈ నేపథ్యంలో వెంటనే కలుగ జేసుకోవాలన్నారు.

కార్మికులకు తోడై.. నీడై..

- కష్టకాలంలో ఆదుకుంటున్న సిఐటియు
- సెజ్ కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటాలు
- కనీస వేతనాల అమలుకు కృషి

పోరు బాటలో సెజ్ కార్మికులు (ఫైల్)



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

2020 కోవిడ్ తొలి రోజుల్లో ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌తో పనిలేక, ఇళ్లకు వెళ్లలేక, కాంట్రాక్టర్లు జీతాలు చెల్లించక ఆకలితో రేకుల షెడ్డుల్లో అవస్థలు పడుతున్న వలస కార్మికులందరి వివరాలు సేకరించి ఆ కార్మిక సంఘం అన్నం పెట్టింది. దాతల నుంచి వస్తువులు, నిధులు సేకరించి 40 రోజులు ఆహారం సరఫరా చేసింది. పని చేయించుకున్న యాజమాన్యాలు, పనిచూపించిన కాంట్రాక్టర్లు కనికరం చూపకుండా వదిలేసిన కార్మికులను ఆదుకుంది. పనిచేసిన కాలానికి జీతం కూడా చెల్లించకుండా ఉన్నపలానా కార్మికులను పొమ్మంటే పైసలతో సహా కాంట్రాక్టర్లు, యాజమాన్యాల నుంచి ఇప్పించింది. అటు ఆ కష్టకాలంలో ముందుండి నిలబడిందీ... ఆహారం సరఫరా చేసిందీ... జీతాలు ఇప్పించిందీ సిఐటియు. ఇదెక్కడ నుకుంటున్నారా ?.. పరిశ్రమలొస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుందని, ప్రగతి దూసుకుపోతుందని ప్రగల్భాలు పలికిన ప్రభుత్వాల నుంచి కోట్ల రూపాయలు రాయితీలు పొంది, కోట్ల రూపాయలు లాభాలు గడించిన పారిశ్రామికాధిపతులున్న అచ్యుతా పురం సెజ్‌లో. ఈ నెల 18, 19 తేదీల్లో పరవాడలో సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో నాడు సంఘం చేసిన సేవా కార్యక్రమాలను, గడిచిన కాలంలో సలిపిన పోరాటాలను ఓసారి పరికించి చూస్తే..

లాక్‌డౌన్ విధించాక యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోకపోయినా వలస కార్మికులను సిఐటియు ఆదుకుంది. భోజనాలు ఏర్పాటుచేసి కార్మికుల పట్ల తమకున్న ప్రేమను చాటుకుంది. వేలాది కార్మికులకు భోజనాలు పెట్టింది. మూడు వేల మంది వలస

మిగతా 2లో..

ప్రయివేటీకరణతో రిజర్వేషన్లకు విఘాతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌తో సహా పలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం వల్ల రిజర్వేషన్లు అమలుకాకుండా పోతాయని, అదే జరిగితే దళితులు, గిరిజనులు, మైనార్టీ తరగతులకు చెందినవారు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారానికి 622వ రోజుకు చేరాయి. దీక్షల్లో మున్సిపల్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలు అధికంగా విశాఖ నగరంలో ఉన్నాయన్నారు. వీటన్నింటిలో రిజర్వేషన్లు అమల్లో ఉండటం వల్ల వేలాది మంది దళిత, గిరిజన సామాజిక తరగతులకు చెందిన యువకులు ఉద్యోగాలు పొంది కుటుంబాలను మంచిగా నడుపుకుంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయటం వల్ల రిజర్వేషన్లు లేకుండా పోతాయని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేయలేదన్నారు. 50 ఏళ్లుగా ఈ కర్మాగారం నడుస్తోందని తెలిపారు. ప్రత్యక్షంగా 30 వేల మంది, పరోక్షంగా లక్ష మంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. అటువంటి సంస్థను ప్రయివేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీక్షల్లో కూర్చున్న వారిలో జెఆర్.నాయుడు, ఇ.ఆదినారాయణ, పి.అప్పలరాజు, ఆర్.శ్రీను, ఎం.ఈశ్వరరావు, పి.అరుణ పాల్గొన్నారు.

'ఉక్కు' దీక్షల్లో నాయకులు

ఉక్కునగరం : విశాఖ ఉక్కును అమ్మేవాడికి, కొనేవాడికి.. ఇద్దరికీ బుద్ధి చెబుతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 671వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, మంగ వెంకటరావు, గుమ్మడి నరేంద్ర, డి.శ్రీనివాస్, చంద్రశేఖర్ మాట్లాడారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కుని, ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పరిశ్రమలు పెట్టడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అంబానీ, అదానీలను ఆహ్వానిస్తే స్వాగతిస్తాంగానీ విశాఖ ఉక్కు వంటి భారీ పరిశ్రమను కారుచౌకగా బడా వ్యాపారవేత్తలకు అప్పగించాలని చూస్తే మాత్రం సహించబోమన్నారు. రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు. సొంత గనులు లేకపోయినా లాభాల్లో నడిచిన ఏకైక పరిశ్రమ విశాఖ ఉక్కునేనని తెలుసుకోవాలన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను ప్రయివేటుపరం చేయడం దారుణమన్నారు. ప్లాంట్‌ను కార్పొరేట్లకు అమ్మేస్తే హిందుస్తాన్ జింక్, ఎయిర్ ఇండియా పరిస్థితే పునరావృతం అవుతుందన్నారు. కృత్రిమ బొగ్గు కొరత సృష్టించి జనవరిలో నిలిపివేసిన బిఎఫ్ - 3లో ఉత్పత్తిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో నాయకులు సీతారామరాజు, త్రినాథ్, చౌదరి, ఎస్ఆర్‌సి.మూర్తి, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

దీక్షల్లో కూర్చున్న పారిశుధ్య కార్మికులు

వైసిపి నేతల వ్యాఖ్యలపై జనసేన నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి వాహనాన్ని చూసి వైసిపి నేతలు వణుకుతున్నారని జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్ అన్నారు. వారాహి వాహనంపై వైసిపి నేతల వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జనసేన వీర మహిళల విభాగం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'వారాహి' సప్త మాతృకల్లో అమ్మవారి పేరని తెలిపారు. 1982లో ఎన్‌టిఆర్, 1999లో ఎల్‌కె.అద్వానీ రథయాత్రలు చేసి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. వారాహి రథయాత్ర ద్వారా పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి సిద్ధమవుతున్నారన్నారు. దీనిని చూసి రాష్ట్ర మంత్రులు తట్టుకోలేకపోతున్నారని చెప్పారు. పవన్ జోలికి వస్తే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన ఉత్తరాంధ్ర మహిళా కో-ఆర్డినేటర్ ఆదిమూలపు సారిని దేవి, కిరణ్ హర్షవల్లి, ప్రియాంక, యజ్ఞశ్రీ, శాలిని, సురేఖ, అడబాల లక్ష్మి, ఎడ్లపల్లి కల పాల్గొన్నారు.

20న ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు ఎయు మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సెమినార్ హాల్‌లో లఘు చిత్రాల దర్శకుడు ఆముధన్ (చెన్నయ్)చే ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 51 ఏళ్ల ఆముధన్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరున్న లఘు చిత్రాల దర్శకుడని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో లఘు చిత్రాల నిర్మాణంలోగల మెళకువలు, స్క్రీన్ ప్లే, తదితర అంశాలను వివరించడంతో పాటు ఆయన నిర్మించి అవార్డులు సాధించిన లఘు చిత్రాలను కూడా ప్రదర్శిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సొసైటీ సహాయ కార్యదర్శి బి.చిన్నారావును 9441571581 నెంబరులో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబుపై విమర్శలు తగవు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టిడిపి అధినేత చంద్రబాబుపై వైసిపి నేతల విమర్శలు తగవని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ అన్నారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించడం ముఖ్యమని, పార్టీ కొత్త కార్యాలయ భవనానికి భూమి పూజ చేయడం గొప్ప కాదని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎండాడ సమీపంలోని పనోరమ హిల్స్ సమీపంలో వైసిపి నూతన కార్యాలయానికి భూమి పూజ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాలలో గెలుపు సాధించాలని జగన్మోహన్ రెడ్డి పగటి కలలు కంటున్నారని, అది ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని అన్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పాటు అన్ని తరగతుల వారినీ మోసం చేసినందుకా 175 స్థానాలు ఆశిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరముందన్నారు.

4న విశాఖ ఫిల్మ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిసారిగా విశాఖ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, విజెఎఫ్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిన 4న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగనుందని చెప్పారు. తెలుగు సినిమా నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సినిమా రంగంలో 24 విభాగాలకు చెందినవారు సినిమాలు, వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిల్మ్‌లను ఈ నెల 28లోపు తమకు పంపాలన్నారు. ఫెస్టివల్ కమిటీ పర్యవేక్షణలో ఎంపిక చేసిన వారికి ప్రముఖుల ద్వారా అవార్డులను ప్రదానం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఫౌండర్ పులగం రామచంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ తామాడ శ్రీనివాసు, సినీ రైటర్, సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ ఐనాడ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పబ్లిక్ అకౌంట్ కమిటీ (పిఎసి) సభ్యునిగా వైసిపి పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి ఎన్నికవడం పట్ల విశాఖకు చెందిన పలువురు నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయనకు బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ సహా పలువురు అభినందనలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
O.S. 88/2022

Between :
Doddi Murali Mohan ...Plaintiff
And
Kandregula Naga Venkata Rameswara Rao ...Defendant

SUMMONS

To,
The Defendant : Kandregula Naga Venkata Rameswara Rao, S/o. K. Rama Appalanaidu, R/at D.No.1-49, Haripalem, Atchuta puram Mandal, Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of an amount of Rs.30,19,200/- with subsequent interest and other reliefs and above suit is stands posted to **28-12-2022** for your appearance. So you have to attend before the Hon,ble Court either personally or through Advocate counsel on **28-12-2022** at **10:30 A.M** failing which the matter will be heard and determined in your absence, as per law.

(By Order of the Hon'ble Court)
PILLA BHASKAR, Advocate
Visakhapatnam,
Cell: 9393109164

IN THE HON'BLE COURT OF THE II ADDL.SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
I.A. 308/2022 in O.S. 88/2022

Between:
Doddi Murali Mohan ...Petitioner/Plaintiff
And
Kandregula Naga Venkata Rameswara Rao ...Respondent/Defendant

NOTICE

To,
The Respondent: Kandregula Naga Venkata Rameswara Rao, S/o. K. Rama Appalanaidu, R/at D.No.1-49, Haripalem, Atchuta puram Mandal, Visakhapatnam.

Please take notice that the above named petitioner/plaintiff has filed a petition I.A.308/2022 to attach your immovable property along with above suit against you for recovery of an amount of Rs.30,19,200/- with subsequent interest and other reliefs. The Hon'ble Court ordered to issue show cause notice to furnish security for the suit amount with suit cost within the period of 72 hours and above matter is stands posted to **28-12-2022** for your appearance. So you have to attend before the Hon'ble Court either personally or through Advocate counsel on **28-12-2022** at **10:30 A.M** failing which the matter will be heard and determined in your absence, as per law.

(By Order of the Hon'ble Court)
PILLA BHASKAR, Advocate
Visakhapatnam, **Cell: 9393109164**

మొదటి పేజీ తరువాయి..

ప్రభుత్వ స్థలంపై వైసిపి కన్ను

కేటాయించే ప్రయత్నం చేయగా, ఆ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. దీంతో నాడు కాపు కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఈ స్థలంలో కల్యాణమండపం నిర్మాణం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈలోగా వచ్చిన ఎన్నికల్లో ఈ స్థలంలో క్రీడా మైదానం, కల్యాణ మండలం నిర్మిస్తామని నేటి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీ ఇచ్చారు. గెలిచారు, మంత్రి కూడా అయ్యారు. కానీ నాడు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. పైగా గ్రామస్తుల సెంటుమెంటుగా పెట్టుకున్న ఈ స్థలాన్ని వైసిపి కార్యాలయానికి కేటాయించాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తేవడం, ఆ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుసుకున్న స్థానికులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు సరికదా, గ్రామస్తులు ఎన్నో ఆశలతో ఏళ్ల తరబడి కాపాడుకుంటూ వస్తున్న భూమిని కాజేయాలని చూస్తున్న నాయకులు ఊళ్లోకి ఎప్పుడు వస్తారా ? అని గ్రామస్తులంతా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ పెద్దలు తమ ప్రయత్నాలుమాని, ఎన్నికల హామీ మేరకు క్రీడా మైదానం, కల్యాణ మండపం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మికులకు తోడై.. నీడై..

కార్మికులున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరుకులు ఇప్పించింది. వాహనాలు ద్వారా ఇళ్లకు పంపించింది. మనిషిని మనిషి చూడ్డానికి కూడా భయపడుతున్న ఆ రోజుల్లో, ఎవరి నుంచి ఎవరికి కోవిడ్ సోకుతుందోనని ఆమడదూరంలో వుంచుతున్న రోజుల్లో సిఐటియు కార్యకర్తలు వలస కార్మికులకు భోజనాలు సరఫరా చేశారు. ఈ సేవలను అభినందించాల్సిందిపోయి, కోవిడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారంటూ సిఐటియు నాయకులపై పోలీసులు కేసులు పెట్టారు. అయినప్పటికీ వెరవకుండా పనిచేసిన కాలానికి జీతం చెల్లించని కాంట్రాక్టర్ల నుంచి సిఐటియు జీతాలు ఇప్పించింది.

అభిజిత్, యూనిఫాట్స్, సుందరం తదితర కంపెనీల్లో జీతాలు పెంచడానికి, బోనస్ చెల్లించడానికి చేసిన కృషి ఫలించింది. ఈ ఏడాది కూడా కోవిడ్ పేరుతో బోనస్ ఇవ్వడానికి నిరాకరించిన, తగ్గించి ఇవ్వాలని చూసిన కంపెనీల నుంచి బోనస్ తగ్గించకుండా యాజమాన్యాలు చెల్లించేలా పట్టుబట్టి సాధించింది. కంపెనీల్లో జరిగిన ప్రమాదాలను దాచిపెట్టి చనిపోయిన కార్మిక కుటుంబాలకు పరిహారం చెల్లించకుండా ఇంటికి పంపించాలని యాజమాన్యాలు ప్రయత్నించిన ప్రతి సందర్భంలోనూ జోక్యం చేసుకొని గరిష్టంగా రూ.20 లక్షల వరకు పరిహారం ఇప్పించింది. ఏ కంపెనీలో ప్రమాదం జరిగినా కుటుంబ సభ్యులు కూడా రాకముందే సిఐటియు నాయకత్వం వెళ్లి బాధితులను ఆస్పత్రులకు తరలించేసి మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తోంది. ఎస్ఇజెడ్‌లో 18, నాన్ ఎస్ఇజెడ్‌లో 80 వరకు పరిశ్రమలున్నాయి. ఈ కంపెనీల్లో కార్మికుల ఉద్యోగ భద్రత, రక్షణ చర్యల కోసం పోరాడుతోంది. ఇతర ప్రాంతాల నుంచి కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులను తెప్పించుకుని యజమానులు పని చేయిస్తున్నారు. రూ.12 వేలు చెల్లించి కార్మికుల కష్టాన్ని దోచుకుంటున్నారు. జీతాలు పెంచాలని అడిగిన ప్రతిసారీ బెదిరింపులు, వేధింపులకు కార్మికులు గురవుతున్నారు. కార్మికులను యజమానులు పర్మినెంట్ చేయడంలేదు. కంపెనీ తరపున కార్మికులను భర్తీ చేసుకోకుండా, కాంట్రాక్టర్ ద్వారా కార్మికులతో పనిచేయించుకుంటున్నారు. మహిళా కార్మికులకు రుతుస్రావం కాలంలో సెలవులు కూడా ఇవ్వని దురాచారం కొనసాగుతోంది. ఇటువంటి దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తున్న సెజ్‌లోని కంపెనీల కార్మికుల పక్షాన సిఐటియు నిలబడి పోరాడుతోంది.

వేజ్ రివిజన్ చేసి వేతనాలు ఇప్పించాలి

సెజ్‌లోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయాలి. కార్మికులను సరఫరాచేసే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, కంపెనీ తరపున కార్మికులను తీసుకొని పర్మినెంట్ చేసి, సౌకర్యాలన్నీ వర్తింపజేయాలి. వేజ్ రివిజన్ ప్రభుత్వం చేయకపోవడంతో పదేళ్ల క్రితం నిర్ణయించిన జీతాలనే యాజమాన్యాలు చెల్లిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే వేజ్ రివిజన్ చేసి దాని ప్రకారం వేతనాలు ఇప్పించాలి. ఇఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సేవలు పెంచాలి.

రొంగలి రాము, సిఐటియు అనకాపల్లి జిల్లా కార్యదర్శి

వైరస్ దాడులపై అప్రమత్తత అవసరం

కోవిడ్-19 వైరస్ దాడి చేసి ఎంతగా కీడు చేసిందో తెలిపారు. ఫోర్త్ వేవ్ కోవిడ్ వచ్చినా పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని ఆమె తెలిపారు. వ్యాధుల సవాళ్లను ఎదుర్కొనడంలో సైన్స్‌లో చాలా మార్పులు వచ్చాయన్నారు. టెలిమెడిసిన్, డిజిటల్ మెడిసిన్ దేశంలో అభివృద్ధి అయిందన్నారు. సైన్స్ రంగంలో వస్తున్న మార్పులపై సమాజంలో చర్చ జరిగేలా, ప్రజాభిప్రాయం కూడగట్టేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఇన్‌ఫెక్షన్స్ చారిత్రక క్రమాన్ని వెల్లడించారు. వ్యవసాయ మొక్కల నుంచి వైరస్‌లు జంతువులకు, ఆ తరువాత మనుషులకు చేరాయన్నారు. స్మాల్ ఫాక్స్, ప్లేగు, ఇతర ఫ్లూలు సమాజంలోకి జొరబడ్డాయన్నారు. రష్యన్ ఫ్లూ, స్పానిష్ ఫ్లూ, కసన హెచ్1ఎన్1, కోవిడ్-19 ఇవన్నీ సమాజంపై దీర్ఘకాలం ప్రభావం చూపాయనీ తెలిపారు. స్మాల్ ఫాక్స్‌పై పరిశోధన, అధ్యయనం ఇంకా పెరగాల్సి ఉందన్నారు. జన్యుపరంగా కొన్ని వ్యాధులు నాటి నుంచి నేటికీ దర్శనమిస్తున్నాయని వివరించారు. వ్యాధుల విషయంలో కొంతమేర భద్రత ఉన్నట్టేనని తెలిపారు. ఇన్సా ఉపాధ్యక్షులు, ఐఐటి ముంబయి మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ డివి.ఖాఖర్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16 వరకూ మూడు రోజులపాటు విశాఖలో జరుగనున్న ఈ వార్షిక సమావేశాలకు దేశ నలుమూలల నుంచి 200 మంది శాస్త్రవేత్తలు హాజరయ్యారన్నారు. తొలుత ప్రతినిధులకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ (సిఎస్ఐఆర్-గోవా) డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కె సింగ్ సాదర స్వాగతం పలికారు. విశాఖపట్నానికి చెందిన డాక్టర్ జిపిఎస్.మూర్తి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు.

క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కంచరపాలెం : జీసస్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రామ్‌నగర్‌లోని హోలీ చర్చి ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ, క్రైస్తవ్యం అంటేనే ఈ లోకంలో ఎవరూ జీవించని విధంగా ప్రత్యేకంగా ఉండాలని చెప్పారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించినప్పుడే నిజమైన క్రైస్తవ్యాన్ని మనం ఇతరులకు అందించిన వారమవుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీసస్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బిషప్ దేవానంద్, 47వ కార్పొరేటర్ కంటిపాముల కామేశ్వరి, గురుజీ, రెవరెండ్ పీటర్, రెవరెండ్ శ్రీనివాస్ పాల్ పాల్గొన్నారు.

పిఎం.పాలెం : మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో జీసస్ బ్లెస్సింగ్ చర్చి నిర్వాహకుడు అంతర్జాతీయ సువార్త సేవకుడు రెవరెండ్ విజయ్‌కిషోర్ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సంఘ సభ్యులకు, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్ చేసి క్యాండిల్ సర్వీస్ చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ హాజరయ్యారు. అతనిని సంఘ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు వైసిపి అధ్యక్షుడు హనుమంతు సురేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల భరత్, ముక్కాబత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-గాజువాక: జివిఎంసి 65వ వార్డు పరిధి రాజీవ్ మార్గ్, సంజీవగిరికాలనీ సచివాలయం వద్ద తడి పొడి చెత్తపై వార్డు కార్పొరేటర్ బొడ్డ నరసింహపాత్రుడు అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం మాట్లాడుతూ, పరిశుభ్రత పాటించడం ద్వారా పట్టణ ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆరోగ్య సమాజ స్థాపనలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. గాజువాక పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి వార్డులోనూ ప్లాస్టిక్ ఏరివేయడంతోపాటు తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని కోరారు. ఇంటి చుట్టు పక్కల కాలువలో, రోడ్లపై చెత్త వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ అసిస్టెంట్ మేనేజర్ ఎ.హేమలత, ఎఎంహెచ్ఓ కిరణ్‌కుమార్, నాగిశెట్టి శ్రీనివాస్, సింగంపల్లి దేముడు, ఎజ సుబ్బారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్, సిఐ అనంతరావు, అడ్మిన్ గణేష్, పెంద్రరాజు తదితరులు పాల్గొన్నారు

ప్రధాన రహదారిలో అడ్డగింత

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు పరిధి లక్ష్మీపురం కూడలి నుంచి చింతలఅగ్రహారంనకు వెళ్లే రహదారిని నాగరాజు కుటుంబీకులు కర్రలు అడ్డంగా పెట్టి మూసివేశారు. దీనిపై స్థానికులు అందరూ చేరి ఆ కుటుంబంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై నాగరాజు మాట్లాడుతూ, కొద్ది నెలల క్రితం రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఈ స్థలం మాది అని చెప్పడంతో ఇక్కడ అడ్డకట్టు వేసామని తెలిపారు. కొన్ని దశాబ్దాలుగా ఈ రహదారి వెంబడి రాకపోకలు సాగుతున్నాయని, రహదారిని సొంత దారిగా ఏ విధంగా మారుస్తారని స్థానికులు ప్రశ్నించారు. ఈ వివాదం స్థానిక పెద్దల వద్దకు వెళ్లింది.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ కాకుండా చూడాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ స్థలాలు ఎక్కడా ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా జివిఎంసి 24వ వార్డులో స్థానిక కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కమిషనరు రాజాబాబు, వైసిపి సమన్వయకర్త కె.కె రాజుతో కలిసి బుధవారం పర్యటించారు. స్థానికుల సమస్యలనడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న గెడ్డలు, కల్వర్టులు ఆక్రమణకు గురికావడంతో ఎక్కడికక్కడ వ్యర్థాలు నిలిచిపోతున్నాయని స్థానికులు వివరించారు. కొత్త రేసపువానిపాలెం, పాత రేసపువానిపాలెంలకు ఒకే శ్మశానం ఉండటంతో ఖనన సమయంలో రహదారి అధిగమించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారని కమిషనర్ దృష్టికి కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యపై చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. వార్డుల్లో మౌలిక వసతులపై నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

వార్డులో పర్యటిస్తూ పలు సూచనలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి - తగరపువలస : బొగ్గులరోడ్డు -3 సచివాలయం పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. విద్యా దీవెన, అందరికీ ఇళ్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ మేరకు అందుతున్నవీ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాలు వెలిగించాలని కొంతమంది స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తిచేశారు. జివిఎంసి ఒకటో వార్డు కార్పొరేటర్ అక్కరమాని పద్మ, కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, జోనల్ కమిషనర్ ఎస్ వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, వైసిపి వార్డు అధ్యక్షులు జగ్గుపిళ్ల ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కొప్పల రమేష్, నాయకులు పందిరి విజయ్, అక్కరమాని చినబాబు, తమ్మిన అశోక్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలో ఉన్న తోటవీధి తదితర ప్రాంతాల్లో బుధవారం టిడిపి నాయకులు 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రచ్చ బండ నిర్వహించి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, వైసిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలు అవస్థలు పడుతున్నారని విమర్శించారు. ఇంటి పన్ను పెంపు, చెత్త పన్ను విధింపు, విద్యుత్ ఛార్జీల పెంపు తదితర భారాలు ప్రజలపై ఈ ప్రభుత్వం మోపిందన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు సిహెచ్ రమణ, ఎ.గురునాథ్, వి.రాంబాబు, కొక్కిరి అప్పన్న, ఎం.సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో..

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు ఆధ్వర్యంలో విజయదుర్గా కాలనీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. దీనిలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలనడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాదరు బాలరాజు, ఒమ్మి రాజు, కాళ్ల మహేష్, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ పేరిట కరపత్రాలు అందజేస్తున్న కోరాడ రాజబాబు

మిజోరం గవర్నర్ అభినందనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : విశాఖపట్నం జిల్లా ట్రెథ్లాన్ అసోసియేషన్ సెక్రెటరీ చెల్లుబోయిన నాగేశ్వరరావును మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు బుధవారం తన నివాసంలో అభినందించారు. గత 25 సంవత్సరాలుగా నాగేశ్వరరావు అందిస్తున్న క్రీడా సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ ట్రైనర్ ఎక్స్‌క్లూజివ్ పురస్కారం ఇటీవల అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చేసిన జ్ఞాపికను హరిబాబు నాగేశ్వరరావుకు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. గ్రామీణ గిరిజన ప్రాంత క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు నాగేశ్వరరావు చేస్తున్న కృషిని కొనియాడారు.

భీమునిపట్నం : 'సేవ్ గర్ల్ చైల్డ్' అంశంపై ఇటీవల స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన చిత్ర లేఖన పోటీల్లో ప్రథమ బహుమతి అందుకున్న స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని పల్లా రసజ్ఞను మిజోరం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు అభినందించారు. ఇటీవల విశాఖ నగరానికి వచ్చిన నేపథ్యంలో ఆయన నివాసంలో విద్యార్థిని రసజ్ఞను అభినందించారని తండ్రి భరత్ కుమార్ బుధవారం తెలిపారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్ పర్సన్ కొండా రమాదేవి, కార్యదర్శి వెంకటరావు, జాతీయ మానవ సేవా అవార్డు గ్రహీత రవికుమార్ తదితరులు అభినందించారని పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-పద్మనాభం : ప్రణాళికా రూపకల్పనపై రెండు రోజులుగా జరిగిన శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ సచివాలయం సిబ్బంది, కార్యదర్శులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిపి కె.రాంబాబు ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. బుధవారంతో శిక్షణ ముగిసింది.

నేరాలు ఘోరాలు

4 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ:కొంగసింగి రహదారిలో నాలుగు లీటర్ల సారాతో ఒక వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు కెడిపేట ఎస్సై సూర్యనారాయణ తెలిపారు. రత్నంపేట గ్రామానికి చెందిన అరిమెల నారాయణ 4 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

వరకట్నం కేసులో 6 నెలల జైలు

ప్రజాశక్తి-సీతమ్మధార : వరకట్నం కేసులో పులగం వెంకట మురళీకుమార్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ విశాఖ 1వ మున్సిపల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సిహెచ్.యుగంధర్ తీర్పు చెప్పారు. 2016లో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పులగం వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు నివేదికను కోర్టుకు సమర్పించారు. కోర్టులో విచారణ అనంతరం పై విధంగా న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు నాలుగోపట్టణ పోలీసులు తెలిపారు.

వికలాంగులకు వీల్ చైర్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : రోటరీ ఇంటర్నేషనల్ ఆర్థిక సాయంతో వికలాంగులకు వీల్ చైర్లను జెడి ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి అందజేశారు. విశాఖ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు సురేష్ మీనన్ ఆధ్వర్యాన తోటగరువు వెర్నిమాంబ గుడి వద్ద బుధవారం పంపిణీ చేపట్టారు. 15 మంది వికలాంగులకు వీల్ చైర్లను ప్రియాంక దండి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వికలాంగుల్లో చాలా మంది ఉన్నత చదువులు చదువుకొని చాలీచాలని ఆదాయంతో బతుకుతున్నారన్నారు. వారికి ప్రభుత్వం ఉపాధి కల్పించాలని కోరారు. వికలాంగులు వారి కుటుంబాలను పోషించుకునేలా సాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వీరికి సాయం చేసేందుకు జెడి ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద ఒమ్మి రామరాజు, తిరుపతి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షునిగా గోవిందరాజు

ప్రజాశక్తి - ఆరిలోవ : విజయవాడలో జరిగిన పశుసంవర్ధక శాఖ రాష్ట్ర లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ సర్వీస్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలలో రాష్ట్ర అధ్యక్షులుగా బోనం గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోవిందరాజుకు ఆంధ్రప్రదేశ్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ చైర్మన్ ఎస్.అప్పారావు, జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడుతూ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ సభ్యుల యొక్క అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నూతన వధూవరులకు గంటా ఆశీర్వాదం

ప్రజాశక్తి- పిఎం పాలెం : మధురవాడ విశాలాంధ్ర విలేకరి చింతాడ వరప్రసాద్, సునీత వివాహ వేడుకలకు ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు బుధవారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, గరే గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బాబా పహార్ వాలే ఉర్సు వేడుకలు

ప్రజాశక్తి- కంచరపాలెం : అక్కయపాలెం రహదారి తాజ్ బాగ్‌లో ఉన్న హజ్రత్ బాబా పహార్ వాలే ఔలియా ఉర్సు వేడుకలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు హజరత్ బాబా పహార్ వాలే ఔలియా ఉర్సు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు ఉర్సు ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా 15వ తేదీ ఉదయం 11గంటలకు ఖురాన్ ఖాని, 16వ తేదీన మధ్యాహ్నం 2.30 గంటలకు తాజ్ బాగ్ ఆశ్రమం నుంచి అల్లిపురంలో ఉన్న హజరత్ సయ్యద్ ఖామూష్ బాబా దర్గా వరకు సందల్ ఊరేగింపు ఉంటాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం 7గంటలకు బాబా సమాధిపై సందల్, చాదర్ సమర్పణ సలతూ సలాం, ఫాతెహా, అనంతరం తబురుక్ కార్యక్రమం జరుగుతాయని వివరించారు. 17వ తేదీ ఉదయం 7గంటలకు బాబా వారి జెండా ఆవిష్కరణతో ఉర్సు ఉత్సవం ముగుస్తుందని తెలిపారు.

ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఓ సందర్శన

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలిచ్చారు. రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. అనంతరం లోడగలవానిపాలెంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలు, ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు అయిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దొంగతనాలు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలను అరికట్టేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగాధిపతి చంద్రశేఖర్‌కి జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆధ్వర్యాన ఉక్కునగరం సిపిఎం కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఉక్కునగరంలో ఈ నెల 11, 12 తేదీలలో సెక్టర్ 11లో 206 డి, సి, 827, 201డి, సెక్టర్ 6లోని 326 ఎఫ్, 328 ఇ క్వార్టర్లలో దొంగతనాలు జరిగాయని వివరించారు. డబ్బుతో పాటు పెద్దమొత్తంలో బంగారం, వెండి అపహరణకు గురైయిందని తెలిపారు. ఇంట్లో నిద్రించేవారిని బయటపెట్టి లూటీచేశారని వివరించారు. ఈ ఘటనలు ఉక్కునగర వాసులను తీవ్ర భయాందోళనకు గురిచేశాయని తెలిపారు. వివిధ అవసరాలకోసం బయటకు వస్తున్న మహిళల మెడలలో ఉన్న బంగారం గొలుసులను లాక్కెళుతున్నారని, అడ్డుకోబోయిన వారిపై కత్తులతో దాడి చేసి గాయపరచిన విషయం మీకు తెలిసిందేనని వివరించారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి ఉక్కునగరంలో దొంగతనాలు అరికట్టటానికి, ప్రజలకు రక్షణ కల్పించటానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. వివిధ క్వార్టర్లలో దొంగలు అపహరించిన డబ్బు, బంగారు, వెండి వస్తువులను వెంటనే రికవరి చేసి బాధితులకు ఇవ్వాలని కోరారు. స్టీల్ యాజమాన్యం పోలీస్ కమిషనర్‌తో చర్చలు జరిపి పోలీస్ గస్తీని పెంచే చర్యలు చేపట్టాలని కోరారు. స్టీల్‌ప్లాంటు యాజమాన్యం పరిధిలో 265 మంది హామ్‌గార్డులు ఉన్నారని, వీరందరికి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యమే వేతనాలు చెల్లిస్తోందని, వీరిలో కనీసం ఐదుగురిని చొప్పున ప్రతి సెక్టర్‌కి రాత్రి గస్తీ కోసం కేటాయించాలని కోరారు. క్యాంపులు వెళ్లే వారి క్వార్టర్లకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వీటిని పర్యవేక్షించేందుకు టౌన్ అడ్మిన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి సెక్టర్‌లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఉక్కునగర వాసుల భద్రత కోసం స్టీల్ యాజమాన్యం ప్రతి నెలా పోలీసులు, ప్రజలతో సమావేశాలు నిర్వహించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగాధిపతి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంగారావు తదితరులు



సిఐటియు అక్కయ్యపాలెంజోన్ నూతన కమిటీ సభ్యులు

సిఐటియు అక్కయ్యపాలెం జోన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విశాఖపట్నం : సిఐటియు అక్కయ్యపాలెం జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జోన్ నాలుగో మహాసభలు తాటిచెట్లపాలెం భవననిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో ఉద్యమాలు తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం నూతన సమాజాన్ని నిర్మిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహాసభల రిపోర్టును ప్రకాష్‌రావు ప్రవేశపెట్టారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా స్వతంత్రకుమార్, ప్రకాష్‌రావు, కమిటీ సభ్యులుగా 8 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, ప్రభాకరరావు, శంకర్ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ పివి.సురేష్

మలేరియా విభాగంలో తనిఖీ

ప్రజాశక్తి - ములగాడ : జివిఎంసి జోన్ - 5 పరిధి మల్కాపురం మలేరియా విభాగ కార్యాలయాన్ని బుధవారం జివిఎంసి అడ్ - హాక్ కమిటీ సభ్యులు 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పీవీ సురేష్ సందర్శించారు. జోన్‌లో మినీ, మెగా ఫాగింగ్ మిషన్లు ఎన్ని ఉన్నాయి.. ఏ మిషన్‌కు ఎంత డీజిల్, పెట్రోల్ ఖర్చు అవుతుంది.. ఎంతమంది విధులు నిర్వహిస్తున్నారన్న అంశాలపై రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇటీవల జివిఎంసిలో జరిగిన ఇంటరాల్ కుంభకోణంపై విచారణ జరిపేందుకు విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదేశాలతో కమిషనర్ పి.రాజాబాబు ఎనిమిది మంది సభ్యులతో కూడిన అడ్ - హాక్ కమిటీని వేసినట్లు తెలిపారు. ఫాగింగ్ తదితర విషయాలపై జోన్ మలేరియా ఇన్‌స్పెక్టర్ నల్ల శ్రీనివాస్ యాదవ్‌తో చర్చించిన అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించామని చెప్పారు.

ఇంటరాక్ట్ కాన్ఫరెన్స్ అభ్యాస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నం జిల్లాలో రోటరీ క్లబ్ విశాఖపట్నం, వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇంటరాక్ట్ క్లబ్ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక ఎల్‌విసి క్వార్టర్‌లో విడుదలచేశారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్ చైర్ రోటేరియన్ మోదాంబికాదేవి మాట్లాడుతూ, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 ఆధ్వర్యాన ఈ నెల 18న ఇంటరాక్ట్ కాన్ఫరెన్స్ అభ్యాస్‌ను అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోటరీ ప్రముఖులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఫౌండర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, పిల్లలకు ఉపయోగకరమైన అనేక విజ్ఞాన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జిల్లాలో ఉన్న 100 ఇంటరాక్ట్ క్లబ్ నుంచి 500 మంది పిల్లల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్.హరిత, కో-కన్వీనర్ డి.శైలజ, కె.సుశీల, సభ్యులు డి.నీలవేణి, ఎస్.నాగమణి, బి.గణేష్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదలచేస్తున్న రమాప్రభ తదితరులు

వేతన సవరణపై సమావేశం

ప్రజాశక్తి-ఉక్కునగరం : వేతన సవరణపై అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులతో స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ ప్రధాన పరిపాలన భవనంలోని ఆయన కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్టీల్ ప్లాంట్ సుమారు రూ.2,300 కోట్ల నష్టాల్లో ఉందని, కార్మికులకు జీతాలు చెల్లించడం కూడా ఇబ్బందిగా ఉందని సిఎమ్‌డి తెలిపినట్లు కార్మిక సంఘాల నేతలు చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌లో కొత్త ఉద్యోగుల నియామకంతో పాటు వేతన సవరణ జరిగిపోయేదని, కానీ ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ మినిస్ట్రీ చేతిలోకి వెళ్లిపోయిందని సిఎమ్‌డి వెల్లడించారని తెలిపారు. కంపెనీ లాభాల్లోకి రాగానే వేతన సవరణ చేస్తామని లేకుంటే యూనియన్లు అన్నీ స్టీల్ సెక్రెటరీతో కలిసి వేతన సవరణపై చర్చించాలని సిఎమ్‌డి సూచించినట్లు చెప్పారు. సిఎమ్‌డి వ్యాఖ్యలను అన్ని యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకించాయి. యాజమాన్యం 15 రోజులలోగా వేతన సవరణపై ఒక నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే జరిగే పరిణామాలకు పూర్తిగా యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. ఈ సమావేశంలో గుర్తింపు యూనియన్ నాయకులు డి.ఆదినారాయణ, కెఎస్ఎన్.రావు, జె.రామకృష్ణ, ఐఎన్‌టియుసి నాయకులు ఎన్.రామచంద్ర రావు, కారు రమణ, సిఐటియు నాయకులు యు.రామస్వామి, అయోధ్యరామ్, గణపతిరెడ్డి (హెచ్ఎంఎస్), కె.శ్రీనివాసరావు (బిఎంఎస్), వై.మస్తానప్ప, దాలినాయుడు (వైఎస్ఆర్‌టియుసి), మణి, బొడ్డు పైడిరాజు, పి.జయ, సింహాద్రి (టిఎన్‌టియుసి), పరంధామయ్య, కామేష్ (యాజ్), జగదీష్ (విఎస్ఎమ్ఎస్), పాడి త్రినాథ్ (విఎస్‌ఇయు), కె.ప్రకాష్ (సిఫ్‌టియుఐ), సిహెచ్.సన్యాసి రావు (ఎఐసిటియు), డేవిడ్ (డిఐటియు) పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఇంధన పరిరక్షణ దినోత్సవం

ఇంధన పరిరక్షణ పక్షోత్సవాల్లో మాట్లాడుతున్న సిఎమ్‌డి అతుల్‌భట్

ప్రజాశక్తి-ఉక్కునగరం : జాతీయ ఇంధన పరిరక్షణ పక్షోత్సవాలను స్టీల్‌ప్లాంట్ లెర్నింగ్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్ భట్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ఇంధన పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రారంభం నుంచి ఇంధన సామర్థ్యం పొదుపులో ముందంజలో ఉందన్నారు. దేశంలోనే అత్యుత్తమ ఇంధన సామర్థ్యం ఉన్న ఉక్కు కర్మాగారంగా గుర్తింపు పొందిందని తెలిపారు. కోక్ డ్రై క్వెన్చింగ్, బిఎఫ్ టాప్ ప్రెజర్ రికవరీ, ఎల్డి గ్యాస్ రికవరీ తదితర వివిధ అధునాతన వ్యవస్థలలో వేస్ట్ హీట్ రికవరీ సిస్టమ్ ద్వారా స్టీల్ తయారీలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ క్లీనర్ టెక్నాలజీలను డిజైన్ దశలోనే ఆర్ఐఎన్ఎల్ ఇన్‌స్టాల్ చేసిందని తెలిపారు. నిర్దిష్ట శక్తి వినియోగాన్ని తగ్గించడానికి సాంకేతికత దోహద పడిందన్నారు. సిఐఐ ద్వారా నాలుగుసార్లు ఆర్ఐఎన్ఎల్ ప్రతిష్ఠాత్మక నేషనల్ ఎనర్జీ లీడర్ జాతీయ స్థాయి అవార్డు పొందడం అరుదైన విషయమని తెలిపారు. మరో ప్రభుత్వ రంగ సంస్థ వరుసగా నాలుగు సార్లు ఈ అవార్డును గెలుచుకోలేదని గుర్తు చేశారు. ఇందుకు ఎనర్జీ మేనేజ్‌మెంట్ విభాగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిజిఎంలు, డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు, విభాగాధిపతులు, ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ సభ్యులు, ట్రేడ్ యూనియన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా 'మాకినేని' జయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి మాకినేని బసవపున్నయ్య 108వ జయంతిని ఎవిఎస్ఆర్.నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కన్వీనర్ రాజు మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ఎనలేని కృషిచేసిన మాకినేని నేటి తరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గౌరీష్, జ్యోతి, చిలక, చంటి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల రద్దు దుర్మార్గం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ ట్రైనీ నియామకాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షను యాజమాన్యం రద్దు చేయడం అన్యాయమని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పేర్కొన్నారు. బుధవారం స్టీల్ సిఐటియు కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పోస్టుల నియామకం కోసం జనవరి 2020లో నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. ఈ పరీక్షలో 188 మంది మేనేజ్‌మెంట్ ట్రైనీలు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వీరు ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న సమయంలో రెండేళ్ల తర్వాత ఈ పరీక్షను రద్దుచేయడం వారి ఆశలపై నీళ్లు చల్లటమేనన్నారు. ఈ పరీక్షను ఇప్పటికే స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులు కూడా రాశారని, వీరిలో సుమారు 70 మంది అర్హత సాధించారని తెలిపారు. రాతపరీక్షలు, మౌఖిక పరీక్ష కూడా నిర్వహించి ఎంపిక చేసిన అభ్యర్థులను స్టీల్‌ప్లాంట్ అమ్మకంలో భాగంగా ఎటువంటి నియామకాలు జరపకూడదనే కారణంతోనే రద్దు చేయడం దారుణమన్నారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన 70 మంది ఇంటర్నల్ అభ్యర్థులకు తక్షణమే ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, నాయకులు జె.అయోధ్యరామ్, బి.అప్పారావు, మరిడయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జానపద కళారూపాల ప్రదర్శన

ప్రజాశక్తి-విశాఖపట్నం : డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంస్కృత జానపద కళా శోభ కార్యక్రమాలు గురువారం నిర్వహించనున్నట్లు నాటా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ కొండపు సుధ తెలిపారు. 200 మంది కళాకారులు ప్రదర్శనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ సంగీత నాట్య విభాగం సహకారంతో ఉత్తర అమెరికా తెలుగు సమితి నిర్వాహకులచే ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కళాకారులు, కళాభిమానులు, సంగీత ప్రియులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదంచేయాలని కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు కుమారుడు వివాహ కార్యక్రమానికి దాకమర్రి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

నేవీ నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-రాంబిల్లి

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. నేవీ మెయిన్ గేట్ వద్ద ఎనిమిది గ్రామాల నిర్వాసితులు చేపట్టిన ఆందోళన బుధవారం నాటికి 45వ రోజుకు చేరింది. ఈ ఆందోళన శిబిరాన్ని సందర్శించిన లోకనాథం మాట్లాడుతూ నేవీ నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించాలని 45 రోజులుగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో పర్యటించినప్పటికీ, నిర్వాసితులతో మాట్లాడినప్పటికీ, నిర్వాసితులు సమస్యలు పట్ల స్పష్టమైన హామీలు ఇవ్వకపోవడం, వాటి అమలుకు కృషి చేయకపోవడం బాధాకరమన్నారు. పిఎఎఫ్ పిడిఎఫ్ గ్రామాల ప్రజల సమస్యలతో పాటు, నేవీ ప్రభావిత గ్రామాల చిన్న కలవలపల్లి, కొత్తపేట గోవిందపాలెం, వాడపాలెం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులందరికీ ఉపాధి కచ్చితంగా కల్పించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు, జేఏసీ పెద్దలు, నిర్వాసితులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై ర్యాలీ చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత అని, అవసరం మేరకే వినియోగించాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి పిలుపునిచ్చారు స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఇంధన పరిరక్షణ పోస్టర్లను ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ, నోడల్ అధికారి ఎస్ రమణమూర్తితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈనెల 14 నుంచి 20 వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నోడల్ అధికారి రమణమూర్తి మాట్లాడుతూ అవసరం ఉన్నంత వరకే విద్యుత్తు వినియోగిస్తే విద్యుత్ పొదుపు చేస్తున్నట్టే తెలిపారు. ఈ సందర్భంగా అనకాపల్లి రింగ్ రోడ్ నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు విద్యార్థులతో విద్యుత్ పొదుపుపై ప్లకార్డులు, నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇంజనీర్లు సురేష్ బాబు, కే రాజశేఖర్ రెడ్డి, విద్యుత్ శాఖ డి ఈ లు, ఏడీలు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్మెన్లు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

నాయుడుపాలెంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - పరవాడ : అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి బుధవారం మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామ సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మెట్టపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం నిర్మాణాన్ని రెండు నెలలలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో క్రీడామైదానం సమస్యను ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో హేమచంద్రరావు, తహశీల్దారు వి.ప్రకాష్ రావు, ఎంఈఓ సునీత తదితరులు ఉన్నారు.

సమగ్ర సర్వేతో భూ యజమానులకు మేలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సమగ్ర భూ సర్వే పథకం భూ యజమానులకు ఎంతో మేలు చేస్తుందని పూడిమడక మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ అన్నారు. పూడిమడక గ్రామంలో బుధవారం డ్రోన్ ద్వారా రీ సర్వే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన భూ సమగ్ర సర్వే పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గంగిరి లక్ష్మీ రవి, వైసిపి గ్రామ శాఖ అధ్యక్షులు సూ రాడ ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ చౌక్ బస్టాప్‌లో సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని నెహ్రూ చౌక్ జంక్షన్‌లో ఉన్న బస్ స్టాప్‌లో రాత్రి సమయాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ మోహనరావుకు, జీవీఎంసీ జోనల్ అధికారులకు అఖిలపక్ష నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. బస్టాప్‌లో వస్తున్న దుర్గంధానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్ స్టాప్ ఎదురుగానే రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. తక్షణమే ఈ సమస్యలపై దష్టి సారించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు గంట శ్రీరామ్, సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, కె.శంకర్రావు, చెల్లూరి నాగరాజు, తాకాసి వెంకటేశ్వరరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు హరినాథ్ బాబు, బిజెపి నాయకులు చదరం నాగేశ్వరరావు, రామకృష్ణ ఉన్నారు.

నిధుల్లేని కార్పొరేషన్లు ఎందుకు?

ప్రజాశక్తి-అనకాపల్లి : జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం బీసీలకు పట్టిన కర్మ అని, నిధులు లేని బిసి కార్పొరేషన్లు ఎందుకని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీల బాబు అన్నారు. స్థానిక 84వ వార్డు చిన్న రాజుపేట, చేపల బజార్ తదితర ప్రాంతాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుప్పిలి జగన్మోహన్, బోడి వెంకటరావు, కసిరెడ్డి సత్యనారాయణ, పండూరి సత్యనారాయణ, వానపల్లి త్రినాథ్, కాండ్రేగుల జగదీష్, పాల్గొన్నారు.

లా వర్సిటీ, ఐఐసిఎల మధ్య అవగాహన ఒప్పందం

ఒప్పంద పత్రాలు చూపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ (డిఎస్ఎన్ఎల్‌యు), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఎ) మధ్య బుధవారం అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. లా వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.సూర్యప్రకాష్, ప్రవీణ్ కుమార్ (డైరెక్టర్ జనరల్), ఐఐసిఎ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పైలా నారాయణరావు ఎంఇయు పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి సూర్యప్రకాష్ మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా భారతదేశంలోని కార్పొరేట్ రంగం వృద్ధికి, సమీకృత, బహుళ-క్రమశిక్షణా విధానం ద్వారా మద్దతు ఇవ్వడానికి దేశ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఐఐసిఎను స్థాపించినట్లు చెప్పారు. డిఎస్ఎన్ఎల్‌యు పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మార్చుకొనే ప్రయత్నాల్లో భాగంగా అకడమిక్, రెగ్యులేటరీ, పరిశోధన సంస్థలతో భాగస్వామ్యాలను ఏర్పర్చుకుంటుందని, ఇందులో భాగంగా ఈ ఎంఒయు కుదుర్చుకుందని తెలిపారు. డిగ్రీ, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సులను, ఎల్ఎల్ఎం వంటి పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రారంభించడానికి, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ప్రచురణ, నిపుణుల సలహా, ఉమ్మడి వర్క్‌షాప్‌లు, సెమినార్‌లు, సమావేశాలు నిర్వహించడం, ఇతర విద్యాపరమైన సహకారం కోసం ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.మధుసూధనరావు, ప్రొఫెసర్ ఎ.రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ దయానంద మూర్తి, పి.బయోల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

హార్ట్ ఫుల్ నెస్ మోడల్ విలేజ్‌గా సంపతిపురం

ప్రజాశక్తి-అనకాపల్లి : హార్ట్ ఫుల్ నెస్ మోడల్ విలేజ్‌గా మండలంలోని సంపతిపురం గ్రామాన్ని ఎంపిక చేసినట్టు ఎంపిపి గొర్లి సూరిబాబు తెలిపారు. బుధవారం సంపతపురంలో గ్రామపంచాయతీ డెవలప్మెంట్ ప్లాను, మండల స్థాయి డెవలప్మెంట్ ప్లానుపై ఏపీఎస్ఐఆర్డి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ వీఆర్పీలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఐఆర్డి డైరెక్టర్ జె మురళి, జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి అభివృద్ధి ప్రణాళికల్లో అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల జిల్లా పంచాయతీ అధికారులు శిరీష, కొండలరావు, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సోమాంబికను దర్శించుకున్న మంత్రి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం జంక్షన్‌లో ఉన్న సోమాంబికా అమ్మవారు పండుగ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ కమిటీ వ్యవస్థాపకులు చిన్ని సన్యాసి నాయుడు, వైసిపి నాయకులు చిన్ని రాజీవ్ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణరావు, చిన్ని త్రినాథ్ రావు భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని చింతపాక బస్సు స్టాప్ వద్ద తాగునీటి బోరు నిర్మాణానికి ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి భర్త, వైసిపి నాయకులు నాగరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొలజానా శ్రీను పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న వైసిపి నాయకులు నాగరాజు

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు గురుకుల పాఠశాల ప్రాజెక్టులు ఎంపిక

ఎంపికైన ప్రాజెక్టు చూపుతున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన రెండు నమూనాలు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాయి. కశింకోట బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ నమోనాల ప్రదర్శన నిర్వహించగా, 12 పాఠశాలల నుంచి సుమారు 60 నమూనాలను ప్రదర్శించారు. వీటిల్లో ఐదు ప్రాజెక్టులను జిల్లా ప్రదర్శనకు ఎంపిక చేయగా, అందులో తాళ్లపాలెం అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల నుంచి రెండు నమూనాలు ఎంపికైనట్లు కసింకోట ఎంఈఓ చిట్టిబాబు ప్రకటించారు. ఆ ప్రాజెక్టులకు తర్ఫీదు ఇచ్చిన సైన్స్ ఉపాధ్యాయులు టి.నవనీత వాణి, ఎం.నిర్మల, ఎం.మాధురి, డి.కనకమ్మ, ప్రాజెక్టులు తయారు చేసిన విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ళ మాణిక్యం బుధవారం అభినందించారు. ఈ నమూనాలను ఇంకా మెరుగైన రీతిలో తయారు చేసి జిల్లా స్థాయిలో ఎంపికయ్యేటట్లు కృషి చేయాలని సూచించారు.

గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు

గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట, ఎల్విపి అగ్రహారం, లోపూడి, మంగళ పురం గ్రామాల్లో బుధవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యాన గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా జీవించడానికి, అసమానతలను అంతం చేయడానికి ఏకం అవ్వాలనే అనే నినాదాలున్న బ్యానర్లతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. గ్రామస్తులకు హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహనకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ సకల రామకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీను, అసిస్టెంట్ శివ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ పి.ఉద్దీప, ఎఎన్ఎం ప్రభ, అంగన్వాడీ కార్యకర్త కె.జ్యోతి, సచివాలయ సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరిన టిడిపి కార్యకర్తలు

టిడిపి నుంచి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-చోడవరం : మండల కేంద్రం చోడవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు చిన్న అచ్చిబాబుతో పాటు మండలంలోని రాయపురాజుపేట గ్రామానికి చెందిన 20 మంది టిడిపి కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆధ్వర్యంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిలో చేరిన వారికి సముచితమైన స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొడ్డేటి సూర్యనారాయణ, సేనాపతి సత్యారావు, ఏడువాక సత్యారావు, పల్లా నర్సింగరావు, దేవరపల్లి సత్య, ఒరుగంటి నెహ్రూ, గంగరాజు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో 'రేంజర్స్' విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ పోతల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం విజేతలను రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపల్ సూర్యప్రకాష్, సిబ్బంది మీనాక్షి, లక్ష్మీ పట్నాయక్, పిడి లక్ష్మణరావు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 11న విశాఖ పోర్ట్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో తమ అకాడమీకి చెందిన రాఘవేంద్ర స్వామి తన సత్తా చూపి బంగారు పతకం సాధించగా, ప్రముఖ సినిమా హీరో సుమన్ చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నట్లు చెప్పారు. అలాగే అండర్-19 జాతీయ షూటింగ్ బాల్ పోటీల్లో కె.సంపత్, పి.దిలీప్, ఎం.అరవిందస్వామి, సిహెచ్.చక్రి, డి.నితేష్ తృతీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు.

డైట్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం పాల్గొని మూడేళ్లలో డైట్ కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఇండస్ట్రీకి అకడమిక్స్‌కు మధ్య ఉన్న అంతరాన్ని పూరించడంలో పూర్వ విద్యార్థుల పాత్రను వివరించారు. అనంతరం పూర్వవిద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారి వై హేమంత్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కశింకోట : కర్నూలు జిల్లా ఆత్మకూరులో ఇటీవల జరిగిన 4వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన సిహెచ్.జ్యోతి స్వరూప, బి.మాధురి వెండి పతకాలు సాధించారు. వీరిని పాఠశాలలో బుధవారం ప్రిన్సిపాల్ శైలజా, కోచ్ సిహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తోటాడలో 'ఫ్యామిలీ ఫిజిషియన్'

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని తోటాడ ఉపకేంద్రంలో మునగపాక పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని సర్పంచ్ దొడ్డి మంగవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి అనిల్ కుమార్, తోటాడ ఎంపిటిసి కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు దొడ్డి కోటేశ్వరరావు, దొడ్డి బాలాజీ, డాక్టర్ మంజూష, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.యామిని ప్రియాంక, దేవకాంత్, పంచాయతీ కార్యదర్శి చదరం శ్రీలక్ష్మి, ఫిమేల్ సూపర్వైజర్ కెఎస్ఎం లక్ష్మి, ఎఎన్ఎం క్రి వివిఎస్.రమణి, కొత్తలంక సూరిత్రినాధరావు, పిఎంవి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌లో పాల్గొన్న వైద్య సిబ్బంది

కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

కరపత్రాన్ని విడుదల చేస్తున్న కోటేశ్వరరావు, రాము తదితరులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు చెప్పారు. ఈ నెల 18, 19 తేదీల్లో పరవాడలో జరగనున్న సిఐటియు అనకాపల్లి జిల్లా 12వ మహాసభ కరపత్రాలను బుధవారం స్థానిక ఎస్ఇజెడ్ ప్రాంతంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని ఫార్మా, ఎస్ఇజెడ్‌తోపాటు చిన్న తరహా పరిశ్రమలు, పలు రంగాల్లో అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్లు పని చేస్తున్నారని, వారికి కనీస హక్కులు అమలు కావడం లేదని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగడం లేదని, దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాదిగా ఉన్న స్కీం వర్కర్లు రాజకీయ వేధింపులకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యలపై మహాసభలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. మహాసభ సందర్భంగా 18న పరవాడలో జరుగు భారీ ప్రదర్శన, బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము, మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, నాయకులు రాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన దేవుని మాన్యం స్వాధీనం చేసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని మారేపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 115లో ఆక్రమణకు గురైన 23.15 ఎకరాల దేవుని మాన్యం భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఆక్రమణదారునికి కనీసం నోటీసులు కూడా దేవాదాయశాఖ అధికారులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఈ భూమికి సెటిల్మెంట్ పూర్వం 10(1)లో ఆవుగడ్డ సఖారినాయుడు ధర్మకర్తగా ఉన్నారని, 1956లో భూమి సెటిల్మెంట్ అయిన తరువాత మారేపల్లి శ్రీరాములు ఆలయం పేరున నమోదై ఉందని పేర్కొన్నారు. దీనిని తారువ గ్రామానికి చెందిన వ్యక్తులకు ఏ విధంగా దఖలు పడిందని ప్రశ్నించారు. ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, దేవాదాయశాఖ, అనకాపల్లి, ఉమ్మడి జిల్లాల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ఈ భూమి ఆక్రమణ గురైందని, ఎవరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వరాదని ఈ ఏడాది జూన్ 14న నాటి అనకాపల్లి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ దేవరాపల్లి తహశీల్దార్‌కు లేఖ రాశారని, ఈ భూమి కొనుగోలుదారునికి పాస్ పుస్తకాలు ఇవ్వబడవని మూడు సార్లు రెవెన్యూ అధికారులు తిరస్కరించారని గుర్తు చేశారు. అయినా దేవాదాయశాఖ అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఆక్రమణదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బిటి దొర పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

వృద్ధునితో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం బూడి

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని కొరువాడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మండలస్థాయి అధికారులతో కలిసి చేపట్టారు. గ్రామంలో ప్రతి వీధికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 336 కుళాయిలు ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తున్నామని తెలిపారు. మరో 20వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆ గ్రామంలో రూ.13.50 లక్షలతో నాడు-నేడు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాండ్రేగుల శశిదేవి, తహశీల్దారు రమేష్‌బాబు, జెడ్‌పిటిసి అనురాధ, ఎంపిపి రెడ్డి జగన్మోహన్, స్థానిక ఎంపిటిసి చీపురుపల్లి అచ్చిబాబు, మండల శాఖ అధికారులు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని రాయపురాజుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చేపట్టారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో శ్యామసుందర్, మాజీ జెడ్పిటిసి బి సూర్యనారాయణ, వైసిపి నాయకులు పి నర్సింగరావు, అధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని దోసూరు పంచాయతీ పరిధి కొల్లివానిపాలెం, గొల్లల పాలెం, గండివానిపాలెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ మెంబర్ నర్లల కుమార్, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, వైసిపి నాయకులు దేశంశెట్టి శంకర్రావు, కోన బుజ్జి, కె.విమలా నాయుడు, పంచదారల పైడిరాజు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి-చోడవరం మెయిన్ రోడ్డులో స్థానిక గుండాలు వీధి జంక్షన్ నుంచి తుమ్మపాల వరకు సెంట్రల్ లైటింగ్, కొత్త లైట్లు ఏర్పాటు చేసే పనులను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపిపి విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ మొగసాల లక్ష్మీ వెంకట్, ఎంపిటిసి పంచదారల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్లు పోలమరశెట్టి కృష్ణ, కొయ్య జగద లక్ష్మి భాస్కర్, సత్యనారాయణ, తర్ర సత్యారావు, ఎర్రంశెట్టి రామారావు, చదరం చిన్న, ఈవో కె.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఫ్లకార్డులు చూపుతున్న 108 సిబ్బంది

జీతాలు చెల్లించాలని 108 సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ 108 సిబ్బంది బుధవారం మండల కేంద్రంలో వాహనం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సేవలు అందించే తమకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడానికి నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జీతాలు చెల్లించాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

యాత సామాజిక తరగతి సమస్యలపై వినతి

ప్రజాశక్తి- సబ్బవరం : నియోజకవర్గంలోని యాత సామాజిక తరగతి సమస్యలు పరిష్కరించాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సంఘం అధ్యక్షులు పిల్లి నూకరాజు ఆధ్వర్యాన బుధవారం స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అదీప్ రాజ్ తన దృష్టికి వచ్చిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపి యాత కార్పొరేషన్ డైరెక్టర్ దమ్ము రమణ, వైసిపి మండల సేవాదళ్ అధ్యక్షులు టి.శేఖర్, సంఘం నాయకులు బసరమాని ఈశ్వరరావు, కేసుబోయిన త్రినాథ్, నెల్లి గోపి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండల పరిషత్ నూతన భవన నిర్మాణ పనులతో పాటు మండల కేంద్రంలో పలు ప్రభుత్వ భవనాలు, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు బుధవారం పర్యవేక్షించారు. ఈ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు.

ఆర్‌బికె నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- కశింకోట : మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులను ఎంపిపి కలగా లక్ష్మి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండలంలో జరుగుతున్న పనులు ఏ దశలో ఉన్నాయో సంబంధిత అధికారులను మండల ప్రత్యేక అధికారి మోహన్‌రావు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కొంకి అప్పారావు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేరీ మాత టెంపుల్ యాత్రకు బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి : ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు మతాలకు అతీతంగా తన దాతృత్వాన్ని చాటుకున్నారు. క్రిస్మస్ పండగ సందర్భంగా స్థానిక బర్మా కాలనీ మన్న చర్చ్ సంఘ సభ్యులకు తూర్పుగోదావరి జిల్లా గొరిపట్నం మేరీ మాత టెంపుల్ యాత్ర నిమిత్తం కావలసిన బస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే పలు తీర్థయాత్రలకు 350 బస్సులు పంపించినట్లు చెప్పారు. క్రైస్తవుల పండుగ సందర్భంగా వారికి బస్సు, ఇతర సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ సిహెచ్ డేవిడ్ రాజు, సిహెచ్ శశి కుమార్, వెంకటేష్, శ్రీనివాసరావు, శిరీష, మేరీ, పద్మ, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయానికి స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నూతన జిల్లాగా ఆవిర్భవించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణకు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా స్థలం కేటాయించాలని కోరారు. టిడిపి చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు బత్తుల తాతయ్య బాబు, పివిజి.కుమార్, కుప్పిలి జగన్మోహన్, మళ్ల గణేష్ పాల్గొన్నారు.

పిఎసిఎస్ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్) కార్యాలయ ప్రహరీ నిర్మాణ పనులకు సంఘం అధ్యక్షుడు కోరుకొండ అప్పల నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. డిసిసిబి ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. పిఏసిఎస్ డైరెక్టర్లు గొల్లవిల్లి సత్యనారాయణ, వెలుగుల శ్రీను, కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మద్యం మత్తులో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. బుధవారం ఉదయం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల ఐదవ తేదీన చినగుమ్ములూరు మద్యం షాపు వద్ద రామయ్యపట్నం గ్రామానికి చెందిన పోలిశెట్టి గోవిందరావు, పుర్రె హరిబాబులు మద్యం సేవించేందుకు షాపు వద్దకు వెళ్ళారన్నారు. మద్యం సేవించే క్రమంలో ఇరువురి మధ్య భేదాభిప్రాయం రావడంతో పుర్రె హరిబాబు పోలిశెట్టి గోవిందరావును పక్కనున్న కర్రతో తలపై బలంగా కొట్టినట్లు తెలిపారు. దీంతో బాధితుడిని హుటాహుటిన విశాఖలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. వారంరోజుల అనంతరం పరిస్థితి మెరుగవడంతో ఇంటికి తీసుకురాగా, మరల పరిస్థితి క్షీణించడంతో విశాఖకు తరలించగా, చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. మృతుడి బార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పుర్రె హరిబాబుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంఘటనాస్థలికి సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావులు స్థానికులను విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మాట్లాడతున్న బ్యాంకు మేనేజర్

అర్హులకు రుణాలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల సమావేశం మందిరంలో బుధవారం పలు శాఖలకు చెందిన బ్యాంక్ మేనేజర్లు, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. స్టేట్ బ్యాంకు మేనేజర్ కుమార్ స్వామి మాట్లాడుతూ, ప్రధానంగా జగనన్న తోడు, హౌసింగ్ స్కీములు సహ వ్యక్తిగత రుణాలు సైతం సకాలంలో అర్హులందరికీ రుణాలు అందజేయాలన్నారు. లబ్ధిదారులు సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పలువురు బ్యాంకు ప్రతినిధులు, హౌసింగ్ అధికారులు, వెలుగు సిబ్బంది,పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మొద్దు

ప్రజాశక్తి-చీడికాడ :రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దని ఎంపీపీ కురచా జయమ్మ సూచించారు. బుధవారం అప్పలరాజుపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని ఎవరు కూడా దళారులకు అమ్మవద్దని, రైతు భరోసా కేంద్రాలకు ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వం అందించే గిట్టుబాటు ధరను అందుకోవాలని ఆమె కోరారు. రైతు భరోసా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలను చేస్తున్నామని, 21 రోజుల్లో రైతు ఖాతాలో నగదు జమవుతుందన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ తులసి, పశు సంవర్ధక సహాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు

విత్తనాలు అందజేస్తున్న ఎంపిపి

అంబేద్కర్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-గొలుగొండ: తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అంబేద్కర్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగో న్నతి లభించింది. దీంతో ఆయనకు డిటి ఆనంద్, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, మండల వైసిపి అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబుతో పాటు పలువురు వైసిపి నాయకులు, మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు తదితరులు అభినందనలు తెలిపారు.



అన్‌రాక్ నిర్వాసితులకు స్థలాలు ఇవ్వాలి

మండల సమావేశంలో టిడిపి సభ్యుల డిమాండ్

ప్రజాశక్తి- మాకవరపాలెం: అన్‌రాక్ భూ నిర్వాసితులకు రెండు సెంట్లు స్థలాలు ఎప్పుడు పంపిణీ చేస్తారో చెప్పాలంటూ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు, రాచపల్లి ఎంపీటీసీ ఆర్‌వై పాత్రుడుతో పాటు బూరుగు పాలెం ఎంపీటీసీ రుత్తల యర్ర పాత్రుడు తహసిల్దార్ ప్రసాదరావు, ఎంపీపీ సత్యనారాయణలను ప్రశ్నించారు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సత్యనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిరసించారు. ముందుగా ఏవో చిరంజీవి మాట్లాడుతూ, జనవరి 4 నుంచి ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. 12,900 ఎకరాల్లో ఈ క్రాప్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఎంఈఓ గణేష్ మాట్లాడుతూ, పిఎమ్‌జీసి పథకం కింద మండలంలో 18 పాఠశాలలు ఎంపిక అయినట్లు తెలిపారు. తహసిల్దార్ ప్రసాదరావు మాట్లాడుతుండగా, టిడిపి సభ్యుడు అడ్డుపడ్డారు. భూములు కోల్పోయి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి అధికారులు రెండు సెంట్ల స్థలాలతో పాటు రాచపల్లి భూములు ఆన్లైన్ చేయలేదని వాగ్వాదానికి దిగారు. దీంతో ఎంపీపీ. సత్యనారాయణ కలుగజేసుకొని ముఖ్యమంత్రి పర్యటన నాటికి నిర్వాసితులకు రెండు సెంట్ల స్థలాలు మంజూరు చేస్తామని అనహర్హులను తొలగిస్తామని చెప్పడంతో

ప్రశ్నిస్తున్న సభ్యులు

టిడిపి సభ్యులు ఒకేసారి గొడవలకు దిగారు. అనర్హుల జాబితా అనేది ఇప్పుడు ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. దీంతో కొంత సేపు వాగ్వాధాలు జరిగాయి. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం రెండు సెంట్లు ఇచ్చే భూమి పై ఐదు కేసులు హైకోర్టులో పరిధిలో ఉన్నాయన్నారు. భూ సర్వే జరుగుతున్న పరిస్థితుల్లో రైతుల్లో ఆందోళన కలిగిస్తుందని, దీనిపై రైతులకు స్పష్టమైన సూచనలు తెలపాలని శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామనాయుడు తెలిపారు. రీ సర్వే పై ఎటువంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో. జడ్పిటిసి పెట్ల సత్యవేణి, వైస్ ఎంపీపీ రాజారావు, సత్యవతి, ఎంపీడీవో, ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

ఎపిపిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-గొలుగొండ:ఎపిపిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం గొలుగొండ బ్లాక్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని ఎన్నికల అధికారి వై.రామకృష్ణ తెలిపారు. బుధవారం గొలుగొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఈ ఎన్నికలలో గొలుగొండ, కొయ్యూరు మండలాల్లో హైస్కూళ్లలో పని చేస్తున్న మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారని, తాలుకా యూనిట్ ప్రెసిడెంట్‌గా బివి.సత్యనారాయణ(ఏవో గొలుగొండ), సెక్రటరీగా ఆర్‌విఆర్‌కే.రవికుమార్(జెడ్పీహైస్కూల్ కేడిపేట), వైస్ ప్రెసిడెంట్‌గా వి.జగదీష్(సీనియర్ అసిస్టెంట్, గొలుగొండ), జాయింట్ సెక్రటరీగా పిఎన్‌విఎస్ నాయుడు (జడ్పీ హైస్కూల్, జోగంపేట), ట్రెజరర్‌గా పి.అనితశ్రీ(టైపిస్టు గొలుగొండ), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఆర్‌వి.రాజు(రికార్డు అసిస్టెంట్, జడ్పి హైస్కూల్ జోగంపేట), జిల్లా కౌన్సిల్ సభ్యులు-2 జి.ఎస్‌వి.కృష్ణంరాజు (జూనియర్ అసిస్టెంట్, గొలుగొండ), ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు జిల్లా అధ్యక్షులు ఎస్.సత్తిబాబు అభినందనలు తెలిపారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: సంపద తయారీ కేంద్ర నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేసి వాడుకలోకి తీసుకు రావాలని ఎంపీడీవో సీతారామరాజు, ఇఓపిఆర్డి వెంకటనారాయణ సూచించారు. మండలంలోని ఉద్దండపురంలో బుధవారం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. షెడ్డు నిర్మాణానికి సంబంధించి మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి వస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, పంచాయతీకి కూడా ఆదాయం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వరరావు, పంచాయతి కార్యదర్శి పాల్గొన్నారు.

సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మినీ ఆసుపత్రికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని మోదమాంబ కాలనీలో బుధవారం మినీ ఆసుపత్రి (వెల్ నెస్ సెంటర్) నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. రూ.20 లక్షలతో ఈ భవనం నిర్మాణం కానుంది. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ కళావతి, వైస్ సర్పంచ్ శ్రీ నాదు శ్రీనివాసరావు, పెరుమాళ్ వెంకటరావు, జవ్వాది వరహాలు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కుక్కర మోదకొండ మహేశ్వరి, శిలామంతుల జ్యోతి వాసు, ఉన్నిష నాగ శంకర్, రామచంద్రరావు, గౌరీ పట్టుపు జగన్నాథరావు, వెంకటరమణ పాల్గొన్నారు

శంకుస్థాపన చేస్తున్న నేతలు

ఏలేరు కాలువ భూములు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో ఏలేరు కాలువ భూముల అక్రమణ చేస్తే కేసులు పెడతామని ఏలేర్ శాఖ డీఈ వసంత తెలిపారు. బుధవారం దుంగల వానిపాలెం గ్రామంలో ఏలేరు కాలువ భూమి ఆక్రమణపై వచ్చిన ఫిర్యాదుపై ఆమె విచారణ చేపట్టారు. అనంతరం రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏలేరు కాలువ భూమి ఆక్రమణ గుర్తెంది లేనిది సర్వే చేసి చేస్తామన్నారు. అప్పటి వరకు భూమి చదును పనులు ఆపాలన్నారు. సర్పంచ్ దుంగల వెంకటరమణ పాల్గొన్నారు.

బంధుర సరస్సును శుభ్రం చేయించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక బంధుర సరస్సును వెంటనే పరిశుభ్రం చేయించాలని స్థానిక నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఉపమాక వెంకన్న ఆలయానికి వచ్చిన విజయవాడ జోన్ టిటిడి డిప్యూటీ ఈవో వెంకటయ్యకు బుధవారం వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక పంచాయితీ సర్పంచ్ ప్రగడ వీరబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొప్పిశెట్టి హరిబాబు తదితరులు వినతిపత్రం అందజేశారు. వెంకన్న ఆలయాన్ని టీటీడీ స్వాధీనం చేసుకున్న తర్వాత బంధుర సరస్సుపై సీత కన్ను వేశారన్నారు. సరస్సు చాలా అధ్వానంగా ఉందని, నాచుమొక్కలు, చెత్తతో నిండి, నీరు దుర్వాసన వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులు స్నానాలు ఆచరించడానికి అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. సుధూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, గ్రామస్తులు సరస్సులో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, గతంలో సరస్సులో నీరు స్వామి ఆలయానికి తీసుకువెళ్లి అభిషేకం చేసి భక్తులకు తీర్థంగా ఇచ్చేవారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే చాలాసార్లు సమస్యను టీటీడీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు.మార్చి నెలలో స్వామి వార్షిక కల్యాణోత్సవాలు జరగనున్నాయని, రాష్ట్రం నలుమూల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారని ఈ లోపు సరస్సును శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు (శ్రీను), తోలేటి శ్రీనివాసరావు ,కొప్పిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు .

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ :స్థానిక వెలుగు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి బుధ వారం ఎంపిపి గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు చేతుల మీదుగా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మేలురకం ధాన్యం 17శాతం, ఆర్‌జెఎల్ 100కేజీలకు రూ.2వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రైతులు తమ పంటను ఈ ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని కోరారు. రైతులకు అందుబాటులో ఉండటం కోసం సహకార సంఘాలు, వెలుగు ద్వారా ధాన్య సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, జక్కు నాగమణి, చోద్యం పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, చీడిగుమ్మల పిఎసిఎస్ అధ్యక్షులు రామకృష్ణ, వెలుగు ఏపీఎం మంగ, ఏఒ సంధ్య పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

భూ వివాదాల పరిష్కారం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో అర్ల గ్రామంలో బుధవారం ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల తహశీల్దార్ కె. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జగనన్న భూహక్కు పథకం కింద పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీనివాసరావు మాట్లాడుతూ, భూ వివాదాల పరిష్కారం కోసమే శాశ్వత భూహక్కు పథకంను ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఈ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహశీల్దార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గతంలో పంపిణీ చేసిన పట్టాలకు రీ సర్వే చేయడం జరిగిందన్నారు. ప్రతీ మడికి ఒక ల్యాండ్ పార్శిల్ నెంబరు వేయించి మ్యాప్ కూడా రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఇలా చేయడంతో రైతులకు సమస్యలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రాజుబాబు, బుచ్చంపేట ఎంపిటిసి దాలయ్య, మండల సర్వేయర్ తవిటినాయుడు, వీఆర్వో సత్యనాగశివభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో రాజుపేట శివారు రామన్నపాలెం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు బుధవారం స్థానిక పోలీసులు పట్టుకొని స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ, అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:తారతమ్యాలు, రాజకీయ పార్టీలు అంటూ చూడకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అమలు చేస్తున్నది జగనన్న ప్రభుత్వమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్లబాబూరావు కొనియాడారు. బుధవారం చిన్నగుమ్ములూరు గ్రామం లో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. నవరత్నాల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేపట్టారు. అర్హులైతే పక్కా ఇళ్లు మంజూరు చేస్తున్నామని , పెన్షన్ లు, అమ్మఒడి తదితర పథకాలు అమలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పథకాల బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ప్రపంచ తెలుగు మహాసభలకు ఎంపిక

ప్రజాశక్తి-కొత్తకోట:ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీలలో నిర్వహించే తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు అనకాపల్లి జిల్లా రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన గుంటూరు రామారావు, లక్ష్మణరావు కవలల రచయిత సోదరులు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం వారికి ఆహ్వానం అందింది. విజయవాడలో ఆదికవి నన్నయ రాజరాజ నరేంద్ర సభా ప్రాంగణంలో సుమారు రెండు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో వీరు పాల్గొంటారు. స్వభాషను రక్షించుకుందాం - స్వాభిమానం పెంచుకుందాం అనే అంశాలపై విస్తృత స్థాయి చర్చిచ్చా గోష్ఠి నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే తాము రచించి పంపిన ఉత్తమ తెలుగు రచనలను ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారని చెప్పారు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఎంపిక కావడం పై టి.అర్జాపురం సర్పంచ్ అర్జున్, వైస్ ఎంపిపి భవాని ప్రసాద్, గ్రామ నాయకులు సన్యాసినాయుడు, రమేష్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎంపికైన కవులు

బాడీ బిల్డింగ్‌లో హెడ్ కానిస్టేబుల్ ప్రతిభ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస పట్టణంలో జరిగిన స్టేట్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ - 2022 పోటీలలో నర్సీపట్నం సబ్ డివిజన్‌కు చెందిన క్లూస్ టీం ఇన్చార్జ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావుకు బాడీ బిల్డింగ్ పోటీల్లో నాలుగవ స్థానం దక్కింది. ఈ సందర్భంగా సబ్ డివిజన్ అధికారులు డిఎస్పి కె.ప్రవీణ్ కుమార్, నర్సీపట్నం రూరల్ సిఐ కె.శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిఎస్పి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో పని చేస్తూ బాడీ బిల్డింగ్‌లో ఎన్నో అవార్డులు సాధించి డిపార్ట్మెంట్‌కు మంచి పేరు తీసుకొచ్చిన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావును అభినందిస్తున్నామని తెలిపారు.

అభినందిస్తున్న డిఎస్‌పి, సిఐ

ఉత్పత్తులు ప్రదర్శిస్తున్న నేతలు

విశాఖ డెయిరీ ఉత్పత్తుల విక్రయం

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన వైయస్సార్ మహిళా మార్ట్‌లో విశాఖ డెయిరీ ఉత్పత్తులు విక్రయించనున్నట్లు ఎంపిపి వేమవరపు పెదబాబు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా మార్ట్‌లో డెయిరీ ఉత్పత్తులు పాలు, పెరుగు, పన్నీర్‌తో పాటు ఇతర అన్ని రకాల ఉత్పత్తులు త్వరలో విక్రయం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కుక్కర శ్రీధర్, ఎడ్ల హేమంత్, ఎం.అశోక్, వెలుగు ఎపిఎం అప్పల నరసమ్మ, సిబ్బంది సోమేశ్వరరావు, దంగేటి ప్రసాద్ పాల్గొన్నారు.

294 పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో 24 పంచాయతీ లకు 294 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ ప్రభాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వితంతువులు, వృద్ధులు, వికలాంగులకు కలిపి 294 మందికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఒ రామచంద్రనాయుడు, ఈఒపిఆర్‌డి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పర్యావరణ ప్రమాణాలతో..
కళా వాటర్ ప్యాకింగ్ ఇండస్ట్రీ

- పూసపాటిరేగలో భారీ నీటి సామర్థ్యంతో ఐదు ఎకరాల్లో స్థాపన
- ప్లాంట్ సామర్థ్యం రోజుకు 40 వేల లీటర్లు,
- వంద కిలోమీటర్ల పరిధిలో నీటి సరఫరా
- రక్షిత మంచినీటితోనే ప్రజారోగ్యం సాధ్యం
- 'ప్రజాశక్తి'తో కళా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమణమూర్తి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలోగల 'కళా ఆసుపత్రి' సేవా దృక్పథం అంతకంతకూ విస్తరిస్తోంది. ఉత్తరాంధ్ర ఆసుపత్రుల రంగంలో ఆరోగ్యానికి ఒక పెద్ద భరోసాగా ఉంటూ.. ప్రయివేట్ ఆసుపత్రుల రంగంలో పేదలకు నామమాత్రపు రుసుముతో కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో ప్రజల నోట్లో నాలుకలా మారిన హాస్పిటల్‌గా డాక్టర్ పైడి రమణమూర్తి, డాక్టర్ కళావతి నిర్వహణలో సాగుతున్న ఈ వైద్యశాల అంచెలంచెలుగా ఎదుగుతోంది. నాణ్యమైన వైద్యం, విలువైన ఆరోగ్య సలహాలు, రోగులతో ఆప్యాయ సంభాషణల మేళవింపుగా దశాబ్దాలుగా విరాజిల్లుతోన్న ఈ 'కళా' ఆసుపత్రి... మరో కీలకమైన మైలురాయిని అందిపుచ్చుకుంది. 'కళా వాటర్ ప్యాకింగ్ ఇండస్ట్రీ'గా పూర్తి పర్యావరణ ప్రమాణాలు, ఐఎస్ఒ సర్టిఫికెట్ కంపెనీ అనుమతులతో విజయనగరం-విశాఖపట్నం జాతీయ రహదారిలో పూసపాటిరేగ మండల కేంద్రంలో స్థాపించబడటం ఒక శుభపరిణామం. శ్రీకాకుళం జిల్లా కింతలి గ్రామానికి చెందిన డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి.. 'కళా' ఆసుపత్రి విశాఖ నగరంలోని ద్వారకానగర్ 6వ లైన్‌లో బివికె కళాశాలకు దగ్గరలో దశాబ్దాల క్రితం స్థాపించబడి వైద్య సేవలను అందిస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తరాంధ్ర ప్రజల్లో రక్షిత మంచినీటి డిమాండ్ నానాటికీ పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో 'కళా' యాజమాన్యం 'ప్యాకేజ్డ్ ప్రొటెక్టెడ్ వాటర్' సరఫరా వంటి కీలక నిర్ణయం తీసుకోవడం విశేషం. 'రక్షిత నీరు ప్రజలను రోగాల నుంచి నిలువరించే అత్యంత శక్తివంతమైన సాధనం' అని నమ్మిన కళా ఆసుపత్రి యజమాన్యం ప్రముఖ వైద్యులు పైడి వెంకట రమణమూర్తి, ఆయన సతీమణి కళావతి ప్రజలకు పరిశుద్ధమైన నీటిని సరఫరా చేసేందుకు 'కళా ఆగ్రో ఫుడ్స్' ద్వారా ఈ ప్యాకింగ్ పరిశ్రమను స్థాపించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.రమణమూర్తి (కళా రమణమూర్తి) 'ప్రజాశక్తి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఎందుకు ఈ నీటి పరిశ్రమను స్థాపించాలనుకున్నారు ?

భూమిపై జీవజాలానికి ఉపయోగపడే సహజ వనరు నీరు. అన్ని జీవులూ పెరగడానికి, పునరుత్పత్తికి నీరే అత్యంత కీలకం. అయితే భూమిపై గల నీటిలో 97 శాతం ఉప్పునీరే. మూడు శాతం మాత్రమే మంచినీరు. ఇది చాలా ఆశ్చర్యంగొలిపే అంశం. ఈ మూడు శాతంలోనూ మూడింట రెండు వంతులు హిమానీనదాల్లోనూ, ధ్రువాల వద్ద గల మంచు దుప్పట్లలోనూ ఘనీభవించి ఉందన్నది వాస్తవం. మనిషి బతకడానికి, ఇతర జీవరాశులు ఉత్పత్తికి మిగిలి ఉన్న ఈ మంచినీటిని మరింత సురక్షితంగా అందించగలిగితే అది 'పర్యావరణ సహిత రక్షిత నీరు' అవుతుంది.. అందుకే నేను, నా సతీమణి కళావతి సారథ్యంలో రక్షిత మంచినీటి ప్యాకింగ్ ఇండస్ట్రీకి ప్లాన్ చేసి అమలు చేశాం.

ప్రజలకు రోగాలు రాకుండా ఒక్క నీటితోనే ఎలా సాధ్యం ?

నేడు ప్రజల అనారోగ్యాల్లో సింహభాగం నీటి లోపంతోనే వస్తున్నాయి. ప్రజల మౌలిక అవసరాల్లో నీరే ప్రప్రథమం. నీరు రోగం రావడానికి / రోగం పోవడానికి దోహదం చేస్తోంది. పర్యావరణ సహితంగా నీటిని సరఫరా చేయగలిగితే అనారోగ్య సమస్యలు రావు. నీరు అనేది సమాజ జీవన గమనంలోనూ, వ్యక్తి జీవన విధానంలోనూ అగ్రభాగం ఆక్రమించిందన్నది అందరూ గుర్తించాలి. ప్రజలు కచ్చితంగా రోజుకూ రెండు లీటర్లు కలుషితం లేని నీటిని తాగాలి.

నీరు ఎలా కలుషితం అవుతోంది ?

భూమిలోకి కాలుష్య ఉద్గారాలు, ఇతర మలినాలు వచ్చి నీటిని పాడుచేస్తున్నాయి. మనిషి శరీరం, అతడు జీవించే పరిసరాలు పరిశుద్ధంగా ఉండాలంటే నీరే ప్రధానమైనది. ప్రభుత్వాలు, ప్రైవేట్ సంస్థలు ఏవైనా ఈ రక్షిత నీటి సరఫరా మీదనే దృష్టిసారించాల్సి ఉంది. ప్రభుత్వం నాణ్యమైన, పర్యావరణ ప్రమాణాలతో ఇచ్చే ప్రయత్నాలు చేస్తోన్నప్పటికీ అవకాశం ఉన్నమేరకు సేవా దృక్పథంతో నీటి అవసరాలను గుర్తించే వారు ప్రజల మౌలిక వసతుల్లో భాగమైన నీటి పంపిణీ గురించి ఆలోచించాల్సి ఉంది. ఈ క్రమంలోనే మా బ్రాండ్ నేమ్ 'కళా ఆగ్రో ఫుడ్స్'తో ముందుకెళ్తున్నాం. ఈ వాటర్ ప్యాకింగ్ ఇండస్ట్రీని పూసపాటిరేగలో ఐదు ఎకరాల్లో స్థాపించాం.

మీ ప్యాకింగ్ ఇండస్ట్రీ సామర్థ్యం ఎంత?

పర్యావరణ ప్రమాణాలన్నిటినీ పాటిస్తూ నీటి ప్యాకింగ్ యూనిట్‌ను మూడు నెలల క్రితం పూసపాటిరేగ నేషనల్ హైవే రోడ్డు పక్కనే స్థాపించాం. సరసమైన ధరలకే ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నాం. 100 కిలోమీటర్ల పరిధిలో నీటి సరఫరాకు సిద్ధం అయ్యాం. రోజుకు ప్లాంట్ సామర్థ్యం 40 వేల లీటర్లు ఉత్పత్తి చేస్తున్నాం. ప్యూర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ను ప్రజావసరాల కోసం సరఫరా చేస్తున్నాం. భారీ సామర్థ్యంతో ఈ పెద్ద ప్రాజెక్టును రూపొందించాం. అన్ని ప్రాంతాల నుంచి వాటర్ ఆర్డర్లను స్వీకరిస్తూ సరఫరా చేయడం ప్రారంభించాం. విశాఖ నగరంలోనూ రక్షిత నీటికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా విస్తరించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

తుపాను దెబ్బకు రైతాంగం కన్నీరు

- -మొలకెత్తిన తడిసిన ధాన్యం
- -నేల కొరిగిన వరి చేను
- -ఆందోళనలో అన్నదాతలు

ప్రజాశక్తి -నక్కపల్లి:తుఫాన్ ప్రభావానికి వరి పంట దెబ్బతినడంతో రైతాంగం కన్నీరు పెడుతున్నారు. వరి పంట చేతికందే సమయంలో అకాల వర్షం రైతన్న నడ్డి విరిచింది. శ్రమదోడ్చి కష్టపడి పండించిన పంట కళ్ళముందే నీళ్ల పాలవ్వడంతో రైతులు విలవిల చెందుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి 5115 ఎకరాల్లో సాగు చేశారు. ఏ గ్రామంలో చూసినా వరి ఆశాజనకంగా విస్తారంగా పండింది. చివరి దశలో కోత సమయంలో వరుణుడు రైతాంగంపై పగ తీర్చుకున్నాడు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టి మిట్టాడుతున్నారు. పలు గ్రామాల్లో కోసిన వరి పనలు పొలాల్లోనే ఉండి పోవడంతో వర్షానికి తడిసి ముద్దయ్యాయి. గాలికి వరి చేను నేల కొరిగింది. తుఫాన్ ప్రభావం కారణంగా మూడు రోజుల పాటు వర్షం కురవడంతో వరి పనలు తడిచి పోవడంతో పలుచోట్ల ధాన్యం మొలకెత్తాయి. దీంతో, రైతులు ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో ఆవేదనకు గురవుతున్నారు. చాలామంది రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. తుఫాన్ దెబ్బకు వరి పంట దెబ్బతినడం, ధాన్యం మొలకెత్తడం, నాణ్యత లోపించడంతో రైతన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పుల ఊబిలో నుండి బయట పడేదెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాడైన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

అన్నదాతలను ఆదుకోవాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మాండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలవానిపాలెం గ్రామంలో మాండూస్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటను బుధవారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాండూస్ తుఫాన్ రైతులకు నష్టం మిగిల్చిందన్నారు. వరి చేతికందే సమయంలో అకాల వర్షం రైతులను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కారణంగా కోసిన వరి దెబ్బతిందని, వరి చేను నేల కొరిగిందన్నారు. దీని కారణంగా రైతులు నష్టపోయారన్నారు. తుఫాన్ పోయి 3 రోజులు అవుతున్నా నేటికీ రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు నష్టపోయిన రైతుల పంటలు పరిశీలించక పోవడం, పంటలు నష్టాన్ని నమోదు చేయకపోవడం అత్యంత దారుణమన్నారు. నష్టాన్ని చెల్లించడానికి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు అత్యంత అశాస్త్రీయంగా ఉన్నాయని తెలిపారు. పంటలు కోసిన వరి పనలు నీటి మునిగితే దానికి నష్టపరిహారం ఇవ్వడం సాధ్యం కాదని వ్యవసాయ అధికారులు ప్రకటించడం సరైనది కాదన్నారు. దెబ్బతిన్న పంట నష్టాన్ని నమోదు చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తుఫాన్ కారణంగా నష్టపోయిన ఏ ఒక్క రైతు కన్నీళ్లు పెట్టుకోకూడదని, ఉదారంగా రైతులు నష్టపోయిన పంటలను నమోదు చేసి నష్టపరిహారం చెల్లించాలని ప్రకటించారని, కింది స్థాయిలో దానికి భిన్నంగా అధికారులు చర్యలు కనబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.రాజేష్, పిక్కి రాజు, రైతులు మనబాల సత్తిబాబు, మనబాల దేముళ్ళ, మనబాల దావీదు రాజు, మనబాల నాని పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

డ్వాక్రా నిధులు రికవరీ

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలో జి వెంకటాపురం శివారు సుభద్ర పాలెం గ్రామంలో రెండు లక్షల 65,000 డ్వాక్రా నిధులు పక్కదారి పట్టినట్టు వెలుగు ఏపీఎం చిన్నబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుభద్రపాలెంలో సుమారు 5 గ్రూపులు స్త్రీ నిధి నుండి సుమారు లక్ష రుణాలు పొందారని, వాటి చెల్లింపుల్లో స్థానిక వివోఏ ఆ నిధులు దుర్వినియోగం చేసిందని అన్నారు. నిధులు రికవరీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి నుంచి అయ్యన్న పర్యటన

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఈనెల 15వ తేది నుంచి నిర్వహిస్తున్నట్టు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రుత్తల యర్రాపాత్రుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గురువారం లచ్చన్న పాలెం గ్రామంలో ఇదేం కర్మ కార్యక్రమం చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.